
సాక్షి
పల్నాడు
బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళ వారం 2423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళ వారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభ వించలేదు.

‘నల్లతామర’కు సోలార్ ఎర!

మిర్చిలో రైతన్న కొత్త ప్రయోగం

- పంట పొలాల్లో సాంకేతిక పరిజ్ఞానం
- సోలార్ సిస్టమ్‌తో బ్లూ రంగు లైట్లు ఏర్పాటు
- నల్లతామర పురుగుతో పాటు గుడ్లు పెట్టే పురుగులకూ చెక్



మిర్చి పొలాల్లో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టమ్‌తో కూడిన బ్లూలైట్లు

ప్రత్తిపాడు: పంటను కాపాడుకునేందుకు రైతు పొలంలో చేయని ప్రయోగం అంటూ ఉండదు. విత్తు విత్తిన నాటి నుంచి దిగుబడులు చేతికి వచ్చే వరకు పంటను కాపాడుకునేందుకు కర్ష కులు పడరాని పాట్లు పడుతుంటారు. అటు ప్రకృ తి విపత్తులు, ఇటు తెగుళ్ల ముప్పేట దాడిని సమ ర్థవంతంగా ఎదుర్కొంటూ పంటకు జీవం పోస్తుంటారు. గడిచిన రెండేళ్లుగా మిర్చి రైతుకు నల్లతామర పురుగు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పెద్దపెద్ద శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయో గాలు సైతం ఓ కొలిక్కి రాలేదు. తాత్కాలికంగా పురుగును కొంతమేర కట్టడి చేసేందుకు పొలాల్లో బులుగు లేదా పసుపు రంగు అట్టలు పెట్టుకో వాలని ఉద్యానశాఖ అధికారుల నుంచి శాస్త్ర వేత్తల వరకు అందరూ సూచించారు. చాలా మం ది రైతులు అదే పద్ధతిని అవలంభిస్తున్నారు. వాటికన్నా మరింత మెరుగ్గా పురుగు కట్టడి చేయాలనుకున్నారో ఏమో కొందరు రైతులు పం ట పొలాల్లో కొత్త ప్రయోగం చేస్తున్నారు.

సోలార్ సిస్టమ్స్ పెట్టి..

హలధారి సాంకేతికతనూ వినియోగించుకుంటు న్నాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి



బ్లూ లైట్ కింద ఏర్పాటు చేసిన నీటి టబ్‌లో పడి చనిపోయిన పురుగులు

పురుగు కట్టడికి తనవంతు ప్రయత్నం చేస్తు న్నారు. మిర్చి పొలాల్లో బులుగు రంగు లైట్లతో ఆటోమేటెడ్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు చేసి పురుగు ఆట కట్టిస్తున్నారు. ఒక్కో ఎకరాకు ఒక్కో సోలార్ సిస్టమ్ సెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెట్ ధర ఒకటి రూ.3,500. ఈ లైట్లు రాత్రి ఆరు గంటల నుంచి ఆటోమేటిక్‌గా ఆన్ అవుతాయి. ఇది ఒక్క నల్లతామర పురుగుకే కాదండోయ్.. గుడ్లు పెట్టే రకరకాల పురుగులు కూడా చనిపో తున్నాయి.

అదెలా అంటే..

నల్లతామర పురుగు నివారణకు పూర్తి స్థాయిలో మందులు రాలేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలే దిక్కయ్యాయి. దీంతో రైతులు నల్లతా మర పురుగు నివారణకు చేయని ప్రయోగమం టూ లేదు. సోలార్ సిస్టమ్స్‌తో కూడిన బ్లూ రంగు లైట్లను పొలాల్లో అమర్చుతున్నారు. లైటు కింద భాగంలో ప్లాస్టిక్ టబ్‌లో నీరు పోసి ఉంచు తున్నారు. ఆ నీటిలో ఏదైనా రకం పురుగు మం దును కలుపుతున్నారు. బ్లూ రంగు కాంతికి ఆకర్షి తమై పురుగులు లైటు వద్దకు చేరి అందులో ఉన్న విషపు నీటిలో పడి చనిపోతున్నాయి. దీంతో రైతులకు కాస్తంత ఊరట లభిస్తోంది.

రెండున్నర ఎకరాల్లో రెండు సోలార్ సెట్లు



నేను రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. ఒక్కో ఎకరానికి ఒక్కో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేశాను. ఇం దుకు ఏడు వేల వరకు ఖర్చు అయ్యింది. ఇవి రాత్రి ఆరు గంటల నుం చి ఆటోమేటిక్‌గా వెలుగుతాయి. ఉదయానికి లైటు కింద పెట్టిన నీటి గిన్నెలో నల్లతామర పురుగులు చచ్చిపోయి పడి ఉంటున్నాయి. ఉప యుక్తంగానే ఉంది. రకరకాల పురుగు మం దుల వినియోగంతో పాటు ఈ బ్లూ రంగు లైట్లు, బ్లూ రంగు అట్టలు ఏర్పాటు చేస్తే పురుగు ఉధృతి కొంత మేర తగ్గుతుంది.

– దండమూడి నానారావు, మిర్చి రైతు

నల్లతామరతో పాటు గుడ్లు పెట్టే పురుగులు కూడా..



కొన్ని గ్రామాల్లో రైతులు అక్కడక్కడా ఇలా సోలార్ లైట్లు ఏర్పాటు చేసుకుం టున్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా కొంతమేర ఆశిం చిన ఫలితం కనిపిస్తోంది. నల్లతామర పురు గుతో పాటు గుడ్లు పెట్టే రకరకాల పురుగులు కూడా నీటిలో పడి చనిపోతున్నాయి.

– ఎం.బేబి, ఉద్యాన అధికారి, ప్రత్తిపాడు

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై ప్రిన్సిపాల్స్‌తో నేడు సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: మార్చిలో జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై బుధ వారం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ జి.సు నీత మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుం టూరు జిల్లా పరిధిలో రెండేళ్ల ఇంటర్మీడియెట్ కోర్సులు నిర్వహిస్తున్న అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బుధవారం ఉదయం 10 గంట లకు గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరి యంలో నిర్వహిస్తున్న సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు, ప్రాక్టికల్స్ నిర్వహణ, పరీక్షా కేం ద్రాల ఏర్పాటు వంటి అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

108 అంబులెన్స్‌లో తనిఖీలు




గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ మంగళవారం 108 అంబులె న్సులను మంగళగిరిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సుల్లో వైద్య పరికరాలు ఏవిధంగా ఉన్నాయి, వాటిల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను పరిశీ లించారు. కొద్దిపాటి లోపాలను గుర్తించి తక్ష ణమే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. తని ఖీల్లో డాక్టర్ జయరామకృష్ణతోపాటు, డాక్టర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

నేడు సాగర్‌ప్రాజెక్టుకు కేఆర్ఎంబీ కమిటీ



విజయపురిసౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు జలాశయాల పర్యవేక్షణ కమిటీ బుధ వారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శిం చనున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు, ప్రధానడ్యాం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులోని కాల్వ లను సందర్శించనున్నారు. మంగళవారం విజయపురిసౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు వెళ్ళి అక్కడి మ్యూజి యాన్ని సందర్శించారు. అనంతరం బుద్ధవ నాన్ని సందర్శించారు. కొండను సందర్శించిన వారిలో కృష్ణారివర్ మేనేజ్మెంట్‌బోర్డు కమిటీ సభ్యులు ఏ అజయ్‌కుమార్‌గుప్తా, ఎస్ఈ అశో క్‌కుమార్, ఈఈలు శివప్రసాద్, రాఘవేంద్ర రావులు ఉండగా వీరివెంట సాగర్ డ్యాం ఈఈ మల్లికార్జున్‌రావు, డీఈలు మురళీధర్, సుదర్శ న్,శ్రీనివాస్,ఏఈ కృష్ణయ్య, కోటేశ్వరరావు, తది తరులు ఉన్నారు.వీరికి టూరిజం గైడ్ సత్యనా రాయణ బుద్ధవనం గురించి వివరించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 562.50 అడుగుల వద్ద ఉంది. ఇది 238.2440 టీఎంసీలకు సమా నంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,120, ఎడమకాలువకు 8,718, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,239, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీం తో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 33,797 క్యూసెక్కుల నీరు విడుదలవు తోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,130 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 837.00 అడుగుల వద్ద ఉంది. ఇది 57.5860 టీఎంసీలకు సమానం.

యార్డుకు 1,28,100 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,28,100 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,24,651 బస్తాలు అమ్మ కాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయా నికి యార్డులో ఇంకా 82,219 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

హైరిస్క్ వారికి ఉచితంగా హెపటైటీస్–బి వ్యాక్సిన్



నరసరావుపేట: హెచ్ఐవీ, హైరిస్క్ గ్రూపుల వారికి హెపటైటీస్–బి వైరస్ సోకే అవకాశం ఎక్కువని, వీరు హెపటైటీస్–బి టీకాలు తీసు కోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ ఆఫీసర్ డాక్టర్ కె.పద్మావతి వివరించారు. టీకాను అన్ని ఏఆర్‌టీ కేంద్రాల్లో మంగళవారం నుంచి ఉచితంగా అందిస్తున్నామని పేర్కొ న్నారు. నరసరావుపేట ఏరియా హాస్పిటల్ ఏఆర్‌టీ సెంటర్‌లో హెపటైటీస్–బి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ డాక్టర్ కేఎస్ దయానిధి, నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ బీవీ రంగారావుతో కలిసి డాక్టర్ కె.పద్మావతి ప్రారంభించారు. పేషెంట్ల అవగాహన కోసం పోస్టర్లు విడుదల చేశారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటీస్ కం ట్రోల్ ప్రోగ్రామ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నరసరావుపేట, చిలక లూరిపేట రెండు ఏఆర్‌టీ సెంటర్లలో ఎనిమిది వేల మందికి హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, హైరిస్క్ గ్రూపు వారైన సెక్స్ వర్కర్లు, స్వలింగ సంప ర్కులు, ట్రాన్స్‌జెండర్లు, వలస దారులకు ఉచి తంగా వ్యాక్సిన్ వేయనున్నట్టు ఆమె తెలిపారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.మధుసూధన రావు, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.రత్న కుమార్, హెచ్‌టీసీ ప్రాజెక్ట్ మేనేజర్ హృదయ రాజు,స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు అభివృద్ధి బాట పట్టాలని..

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- జగనన్న వ్యవసాయ భూమి పట్టాల పంపిణీ



జగనన్న వ్యవసాయ భూమి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జేసీ

గురజాల: నిరుపేదలకు న్యాయం చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాల యంలో మంగళవారం జగనన్న వ్యవసాయ భూమి పట్టా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు పం పిణీ కార్యక్రమం 2011లో చివరిసారిగా జరిగిందని తరువాత వచ్చిన ప్రభుత్వాలు భూ పంపిణీపై శ్రద్ధ చూపకపోవడంతో ఎంతోమంది లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేసు కునే వారికి పట్టాలు మంజూరు చేయాలని వాటిని విచారణ జరిపాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. పల్నాడు ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడిన వారు అధికమన్నారు. ప్రతి పేదవాడికి పట్టాలు అం దించడం జరుగుతుందన్నారు.

వివాదాలు లేకుండా చూడాలనే లక్ష్యం : కలెక్టర్ శివశంకర్

గ్రామాల్లో వివాదాలు లేకుండా చూడాలనే ఆకాంక్ష తోనే భూ రీ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామంలో రైతులు అందరూ సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. మొత్తం 81 మంది లబ్ధిదారులకు 87.43 ఎకరాల వ్యవసాయ భూమిని అందించడం జరిగిందన్నారు. గతంలో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయడం జరిగింద న్నారు. జేసీ శ్యామ్ ప్రసాద్, ఆర్డీఓ కె.అద్దెయ్య, తహసీల్దార్ మీసాల దానియేలు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవ న్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మండల కన్వీనర్ సిద్ధాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అ న్నారావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, తదితరులున్నారు.

డబ్లింగ్ పనులు వేగవంతం

డీఆర్ఎం రామకృష్ణ

శావల్యాపురం: గుంటూరు నుంచి గుంతకల్ రైల్వే డబ్లింగ్ పనులు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు గుంటూరు రైల్వే డివిజన్ రీజ నల్ మేనేజరు (డీఆర్ఎం) ఎం.రామకృష్ణ పేర్కొ న్నారు. మంగళవారం శావల్యాపురం రైల్వే స్టేషను సందర్శించి డబ్లింగ్ పనులను పరిశీలించారు. డీఆర్ ఎం మాట్లాడుతూ నరసరావుపేట పరిధిలో మున మాక నుంచి శావల్యాపురం రైల్వేస్టేషను వరకు 22 కిలోమీటర్ల మేర పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. గుంటూరు నుంచి నంద్యాల వరకు 260 కిలోమీటర్ల ఉండగా ప్రస్తుతం రెండవ ట్రాక్ పనులు 120 కిలోమీటర్ల పూర్తి అయినట్లు చెప్పారు. నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 600 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అలాగే నడి కూడి – శ్రీకాళహస్తి పనుల్లో భాగంగా గుండ్లకమ్మ నుంచి దర్శి వరకు 25 కిలోమీటర్ల వరకు పనులు 2024 మార్చి నెలలో పూర్తి చేస్తామని, అలాగే దర్శి నుంచి కనిగిరి వరకు 55 కిలోమీటర్ల వరకు 2025 మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. శావల్యాపురం లో రైల్వేగేటు 268 నంబరు సమీపంలో ఆర్‌యూబీ పనులకు కలెక్టరు నుంచి అనుమతులు వచ్చాయని ఆరు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేస్తామన్నారు.



శావల్యాపురం రైల్వే స్టేషనులో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం రామకృష్ణ

మెరుగైన సేవలతో ఆదాయం పెంచుతాం

- డీజిల్ ధరలు పెరిగినా శైవక్షేత్రాల దర్శనకు గత ఏడాది టికెట్ రేట్లే అమలు
- దసరా,సంక్రాంతికి ప్రజలు ఆర్టీసీని ఆదరించడంతో ఆదాయం పెరిగింది
- తిరుపతికి ఆర్టీసీ టికెట్ బుక్ చేసుకుంటే దర్శనం టికెట్‌కు అవకాశం
- 9 నుంచి శ్రీశైలంకు కూడా అమలు చేసేందుకు ఏర్పాట్లు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో పర్యటిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు

సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వ్యయం తగ్గించుకొని ఆదాయం పెంపొందించటం పై దృష్టి సారించినట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం కల్పించే సౌకర్యాలతో పాటు ఇం కేమైనా అదనపు సౌకర్యాలు కల్పించాలా అన్న దాని పై పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, వినుకొండ, సత్తెనపల్లిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

• కోటప్పకొండ, శ్రీశైలం, మిగతా శైవక్షేత్రాలు అన్నింటికి మహాశివరాత్రి సందర్భంగా బస్సు టిక్కెట్ రేట్లు అవే ఉంటాయన్నారు. బస్సు టికెట్ రేట్లు పెంచక పోవడం వల్ల దసరా, సంక్రాంతికి ప్రజలు ఎక్కువగా ఆర్టీసీని ఆదరించారన్నారు.

• తిరుపతి వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులకు ప్రయాణం చేసే టికెట్‌తో పాటు ప్యాసింజర్ రిజర్వేషన్ ఓపీఆర్ ఎస్ (ఆన్‌లైన్ టికెట్ బుక్ చేసుకున్న వారికి) శ్రీఘ్ర దర్శనం టికెట్ కూడా తీసుకునే వెసులుబాటు ఉం దన్నారు. రోజుకు వెయ్యి టిక్కెట్లు ఆ విధంగా ఎక్కడి నుంచైనా సరే తిరుపతి వెళ్తున్న ప్రయా ణికులు దర్శనం టికెట్ కూడా బుక్ చేసుకునే అవ కాశం ఉందన్నారు. ఇప్పటి వరకు ఒక్క తిరుపతికి మాత్రమే ఉన్న ఈ అవకాశాన్ని శ్రీశైలంకు కూడా విస్తరింప చేయడం జరిగిందన్నారు. ఇది ఈ నెల 9 నుంచి అమలులోకి వస్తుందన్నారు. శ్రీశైలంకు వెళ్లి శివలింగాన్ని తాకే స్పర్శ దర్శనం 275 టికెట్లు, అతి శీఘ్రదర్శనం 300 టికెట్లు, శీఘ్రదర్శనం 500 టికెట్లు వెరసి మూడు రకాల టికెట్లు 1,075 టికెట్లు దేవదాయ, ధర్మాదాయ శాఖ కేటాయిస్తుందన్నారు. శ్రీశైలం వెళ్లే ప్రయాణికులు అక్కడికి వెళ్లాక కౌంట ర్‌లో నిలబడాలా, దర్శనం టికెట్ దొరుకుతుందా లేదా అనే అనుమానాలు లేకుండా నిస్సందేహంగా ఫ్యామిలీతో పాటు ప్రయాణం బుక్ చేసుకోవటానికి ఎంత ధైర్యంగా వెళతారో సీటు రిజర్వేషన్ ఎలా ఉం టుందో పైన వెళ్లాక ఖచ్చితంగా దర్శనం కూడా ఉం టుంద న్నారు. దీనివల్ల ఎక్కువ మంది ప్రయాణికు లకు దర్శన భాగ్యం కలగడంతో పాటు ఇటు ఆర్టీ సీకి అటు దేవదాయశాఖకు ఆదాయం వస్తుం దన్నారు. ఇది క్లిక్ అయితే వీలైనంత త్వరలో ప్రముఖ దేవాలయాలైన కాణిపాకం, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం, ద్వారకా తిరుమల, విజ యవాడ కనకదుర్గ ఆలయాలకు కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు.

• ఇక కార్గో ఆదాయం పెంచాలని, ఖాళీ స్థలాలను లాంగ్ టర్మ్ లీజుకు ఇచ్చి ఆదాయం పెంచుకోవడం జరుగుతుందన్నారు. ముందుగా గ్యారేజీలో ఉద్యో గులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్స్ బ్రహ్మానందరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్ ఆదంసాహెబ్, పల్నాడు డీపీటీఎం శ్రీనివాస రావు, డిప్యూటీ సీఎంఈ జోన్–3 శ్రీనివాసరావు, సత్తెనపల్లి డిపో మేనేజర్ జీఎస్‌వీ విజయ్‌కుమార్ ఉన్నారు.

నాడు పథకాల్లో కోతలు.. నేడు మాటల్లో కోతలు

- టీడీపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరు
- రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



వంకాయలపాడులో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ప్రభుత్వం కొత్త ఒరవడి సృష్టిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మంగళ వారం యడ్లపాడు మండలం వంకాయలపాడులోని ఉపాధిహామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మిం చిన గ్రామ సచివాలయాన్ని మంత్రి ప్రారంభించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు స్థానికంగా అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమస్య లపై సచివాలయాన్ని సందర్శిస్తే సత్వరమే వారి సమస్య పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. వంకాయలపాడు సచివా లయం నుంచి తమ ప్రభుత్వ హయాంలో 4వేలకు పైగా ప్రభుత్వ సేవలు అందించనట్లు వెల్లడించారు. పంచాయతీలోని 5,583 మందికి 20 పథకాలకు చెం దిన రూ.15.50 కోట్ల లబ్ధి పొందారన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను ఎలా తగ్గించుకోవాలనే ఆలోచన చేస్తే ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం అర్హులైన లబ్ధిదారులెవ్వరికీ అన్యాయం జరగకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో విధంగా లబ్ధి చేకూర్చి వారు ఆర్థిక అభ్యున్నతిని సాధించే దిశగా ఆయా పథకాలు అమలవుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, 14 ఏళ్లు సీఎం పద విలో ఉన్న చంద్రబాబునాయుడు ఆందోళన చూస్తుం టే టీడీపీకి ఇక నూకలు చెల్లినట్లేనన్న సంకేతాలు వెలువడుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని, గడపగడప కార్య క్రమంలో పర్యటిస్తున్న సందర్భంలో లబ్ధిదారులు ప్రజాప్రతినిధుల్ని ఆప్యాయంగా స్వాగతించడం, మద్దతు ప్రకటించడం ఇందుకు నిదర్శనాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందిం చి, ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వినూత్న పథ కాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చు తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమంపై సీఎం జగ న్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ రాజకీయ నాయకుడికి లేద న్నారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం.వీరా రెడ్డి, ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు పి.ఝాన్సీ, షేక్ నాజూలా, సర్పంచి వడ్డేపల్లి నరసింహారావు, ఘంటా శంకర్, ఆర్.చింతారావు, బి.శివరామకృష్ణ, వి.శ్రీను బాబు, శ్రీనివాసనాయక్, బొల్లయ్య, ఒ.పూర్ణయ్య, ఖాదర్‌బాష, సయ్యద్ మస్తాన్‌వలి, షేక్ అల్లాబక్షు(బు జ్జి), సుభాని, రవి, మంగయ్య, అంకారావు ప్రజాప్ర తినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయమే ధ్యేయం

వ్యవసాయ, సహకారశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



నంబూరు ఆర్బీకేలో కియోస్క్ ద్వారా సేవలను పరిశీలిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది

పెదకాకాని: లాభసాటి వ్యవసాయమే ధ్యేయం గా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవ సాయ, సహకారశాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి, రైతు భరోసా కేం ద్రాల ముఖ్య కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మం డలం నంబూరు రైతు భరోసా కేంద్రం, పాలసేకరణ కేంద్రాన్ని గోపాలకృష్ణ ద్వివే ది, వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వే ణుగోపాలరెడ్డి మంగళవారం సందర్శించారు. సమీకృత రైతు సమాచార కేంద్రం, ధాన్యం తేమశాతం గుర్తించే పరికరం, కియోస్క్ యంత్రం పనితీరు పరిశీలించారు. రబీ క్రాప్ బుకింగ్ వివరాలు, పొలంబడి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సం దర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ పురుగు మందులు, విత్తనాల కంపెనీలతో మాట్లాడి ధరలు తగ్గించేం దుకు కృషి చేస్తానన్నారు. అలానే వ్యవసాయ యంత్ర సేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. పాడి రైతులు అమూల్ డెయిరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్

సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్

యడ్లపాడు: బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర ప్రసాద్ మండల్ కాంస్య విగ్రహ ఆవిష్కరణను బీసీ సంఘాలన్నీ దిగ్విజయం చేయాలని సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, విగ్రహ నిర్మాణ కమిటీ కో–కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కోరారు. పల్నాడు జిల్లా యడ్లపాడులో బీసీ సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం అయ్యారు. బీసీ సంఘ జిల్లా నాయకులు రాచమంటి చింతారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వారు ప్రసంగించారు. మండల్ –2 ఉద్యమ నిర్మితంలో భాగంగా దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా బీపీ మండల్ విగ్రహాన్ని గుంటూరు నగరంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12వ తేదీన గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డు అమరావతి జంక్షన్ వద్ద జరిగే ఈ కార్యక్రమానికి యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీయాదవ్, ద్రావిడ కళగం అధ్యక్షుడు కె.వీరమణి, తమిళనాడు సీఎం స్టాలిన్ సోదరి, ఎంపీ కనిమొళి, ఎంపీలు మనోజ్‌కుమార్ ఝా, పి.విల్సన్, తిరుమావళవన్, తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, బిహార్, యూపీ, హర్యానా మాజీమంత్రులు శ్యాంరజక్, శివపాల్‌సింగ్, కెప్టెన్ అజయ్‌సింగ్, తెలంగాణ, బిహార్ ఎమ్మెల్యేలు నోముల భగత్, వి.కృష్ణారావు, బీపీ మండల్ మునిమనవడు ఆచార్య సూరజ్‌మండల్ హాజరై బీసీలకు మండల చేకూర్చిన మేలు, మండల్ –2 దిశ నిర్దేశాలను వివరిస్తారన్నారు. ఈ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్సీ జంగా కృష్ణామూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



యడ్లపాడు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

మంత్రి రజినికి ఆహ్వానం..

బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిని బీసీ సంఘాల నాయకులు ఆహ్వానించారు. బీపీ మండల్ విగ్రహ నిర్మాణ కమిటీ కో–కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ నేతృత్వంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సమావేశంలో బీసీ నాయకులు శివకుమార్, కేశవ, ఉప్పాలభాస్కర్, కీర్తి అరుణ్ కుమార్ యలమంద పేరిబాబు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు సమర్థంగా పూర్తిచేయండి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల అభివృద్ధి అధికారులు, ఈవోపీఆర్డీలు, ఏపీవోలు, ఈసీలు, ఏపీడీఏసీలు, డీఇలు, ఏ.ఇలతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ఈ–కేవైసీ వందశాతం పూర్తిచేయాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఏపీవోలు పరిశీలించాలన్నారు. కూలీలకు సంబంధించి ఆధార్‌ను బ్యాంకు ఖాతాలకు, పోస్టాఫీసులకు లింక్ చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్

ఎస్ఎంఎస్ యాప్‌ను ప్రతిరోజు పరిశీలించాలన్నారు. అధికారులంతా క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ, పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన నిధులు, పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రతి టీబీ రోగికి వైద్యసేవలు అందజేయండి

సమీక్షలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ పద్మావతి

నరసరావుపేట: జిల్లాలోని ప్రతి టీబీ రోగికి వైద్యసేవలు అందజేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ కె.పద్మావతి ఆదేశించారు. పల్నాడురోడ్డులోని పాత ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం జిల్లాలోని క్షయ యూనిట్ డాక్టర్లు, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, టీబీ హైలెవల్ విజిటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని అనుమానిత టీబీ లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు చేసి త్వరగా వ్యాధి నిర్ధారించాలన్నారు. ప్రైవేటు వైద్యశాలల వారు కూడా నూతన 200 పడకల వైఎస్సార్ వైద్యశాలలో ఏర్పాటుచేసిన సీబీ న్యాట్(సీబీఎన్ఏఏటీ) పరీక్ష సేవలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి రోగికి ప్రతి నెలా పౌష్టికాహార నిమిత్తం రూ.700 విలువచేసే కిట్లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నామన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌వో) పర్యవేక్షకులు డాక్టర్ విజయకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి గృహాన్ని సందర్శించి దగ్గు, జ్వరం, బరువు తగ్గటం, కళ్లె పడటం, కళ్లెతో రక్తం పడటం తదితర లక్షణాలు ఉంటే పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారించి చికిత్స ప్రారంభించాలన్నారు. జిల్లాలోని ప్రతి వ్యాధిగ్రస్తుని వివరాలు నిక్షయ్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. సమావేశంలో జిల్లా టీబీ వ్యాధి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ అనుమానితుడు ప్రాథమికంగా ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని కోరారు.



టీబీ కిట్లు అందజేస్తున్న డాక్టర్ పద్మావతి, అధికారులు

లాభసాటి పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

- ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి
- పల్నాడులో పండ్ల తోటల సాగు సంతోషకరం

మాచవరం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో గ్రామానికి చెందిన కురేల వెంకటేశ్వర్లు 12 ఎకరాల్లో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంట పొలాన్ని మంగళవారం సందర్శించారు. ముందుగా గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో, వ్యవసాయ శాఖ సిబ్బందితో మాట్లాడారు. ఏడీఏ బి.శ్రీకృష్ణదేవ రాయలు తమ పరిధిలో సాగు చేసే పంటల వివరాలను తెలియజేశారు. రైతులు మాట్లాడుతూ ఆకురాజుపల్లి మేజర్ పరిధిలో చివర భూములకు సాగు నీరు సక్రమంగా అందడం లేదని, భూగర్భ జలాలు పడిపోయి బోర్లు ఎండిపోతున్నాయని, చుక్కల భూములు, ప్రభుత్వ భూములు సాగు చేసుకునే రైతుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, పంట అమ్మకాల సమయంలో కంప్యూటర్ కాటాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆర్‌బీకేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించి, రైతు అనుభవాలను, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్నదే వ్యవసాయ శాఖ లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కోనసీమ, రాయలసీమ ప్రాంతాలు పండ్ల తోటల పెంపకానికి ప్రత్యేకంగా నిలిచాయని, పల్నాడులో పండ్ల తోటలు, ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపడం సంతోషకరమన్నారు. ఇలాంటి రైతులను ఆదర్శంగా తీసుకొని పండ్ల తోటలు, కూరగాయ పంటలు, చిరుధాన్యాలు పంటల సాగుపై మరింత ఆసక్తి చూపాలని కోరారు. రైతుల అనుభవాలను, పంటలకు అనువైన వాతావరణ వివరాలు, సాగునీటి వసతులు తెలుసుకొని ఇతర ప్రాంతాల రైతులకు వివరించేందుకు పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వానికి వివరించేందుకు తాము వారధిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని శ్రీరుక్మిణీపురంలో సాగు చేస్తున్న వరిగ పంటను పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీహెచ్‌ఓ బెన్ని, హెచ్‌ఓ శ్రీనివాసరావు, ఏఓ రామమ్మ, స్థానిక సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి, కన్వీనర్ సింగరయ్య పాల్గొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న నాగిరెడ్డి

చేపల వేటను నిషేధిస్తూ 145 సెక్షన్ అమలు

కొల్లూరు: మత్స్యకారులు చేపల వేటకు వినియోగిస్తున్న వలల విషయంలో చోటుచేసుకుంటున్న వివాదాల నేపథ్యంలో చేపల వేటను తాత్కాలికంగా నిషేధిస్తూ పోలీసు, మత్స్యశాఖాధికారులు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం కొల్లూరు పోలీసుస్టేషన్‌లో మండలంలోని గాజుల్లంక, పోతార్లంక గ్రామాలకు చెందిన మత్స్యకారులతో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, వేమూరు సీఐ వెంకటేశ్వరరావులు సమావేశం నిర్వహించారు. ఇరు గ్రామాలకు చెందిన మత్స్యకారుల మధ్య చేపల వేటకు సంబంధించిన వలల విషయంలో రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అధికారులు చేపల వేట విషయంలో చోటుచేసుకుంటున్న వివాదాన్ని సర్దుమణించేందుకు 145వ సెక్షన్ అమలు చేస్తున్నామని ప్రకటించారు. 145 సెక్షన్ అమలులో ఉన్నన్ని రోజులు ఇరు గ్రామాల మత్స్యకారులు వేట చేపట్టరాదన్నారు. ఇరు గ్రామాల మత్స్యకారులు వేట చేపట్టకుండా పహారా ఏర్పాటు చేయనున్నామని, నిబంధనలను అతిక్రమించి ఎవ్వరు చేపల వేట సాగించినా చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు చర్యలు

గురజాల: ఎకో టూరిజం పార్క్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ఆర్ శేఖర్ చెప్పారు. మండల పరిధిలోని దైద గ్రామంలో అమరలింగేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో ఎకో టూరిజం పార్క్ ఏర్పాటుకు స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సదుపాయం, టాయిలెట్స్, రెస్టు రూమ్‌లు, మొక్కలు పెంపకం మొదలగు వాటికి అనుకూలంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె అద్దెయ్య, తహసీల్దార్ మీసాల దానియేలు అమరలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్, దేవాలయ కమిటీ చైర్మన్ కె నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవి), గుంటూరు రైల్వే బోర్డు మెంబర్ కొమ్మినేని రవిశంకర్, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జిలను సత్కరించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి శేఖర్ తదితరులు

క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శోభారాణి

పెదకూరపాడు: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు తమకు కేటాయించిన పనిని వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ శోభారాణి అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఎస్‌ఓ నీలకంఠేశ్వర రావుతో కలిసి సందర్శించారు. ఏఎస్ఎం, ఆశ కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు చేసే పనిలో వంద శాతం ఫలితం వచ్చేలా చూసుకోవాలన్నారు. తక్కువ పనితీరు కనబర్చిన వారు రాబోయే నెలలో మెరుగైన పనితీరు కనబర్చేలా సూచనలు, సలహాలు అందజేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ వెలుగొండారెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఈఓలు, పీహెచ్‌ఎంలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ శోభరాణి

ఏఎన్‌యూలో మార్కుల టాంపరింగ్‌పై విచారణ

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మార్కుల టాంపరింగ్‌పై పోలీసు విచారణ కొనసాగుతుంది. ఏఎన్‌యూలో బీటెక్ విద్యార్థుల పరీక్షల మార్కులు టాంపరింగ్ జరిగిందని, విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని 15 రోజుల కిందట వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కరుణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమ, మంగళవారాలలో లాం గ్రామ సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 35 మంది బీటెక్ విద్యార్థులను విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే కొంతమంది విద్యార్థులు పరీక్షల్లో తాము ఫెయిల్‌గా భావించి వక్రమార్గంలో ఉత్తీర్ణులయ్యేందుకు ప్రయత్నాలు చేసినట్లు నిర్ధారణ అయింది. వర్సిటీ పరీక్షా పత్రాల వాల్యువేషన్ సెంటర్‌లో కొందరు కిందిస్థాయి సిబ్బందిని ఆశ్రయించి పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పినట్లు ఒప్పుకున్నారని సమాచారం. సిబ్బందిలో పెదకాకానికి చెందిన వ్యక్తి కూడా ఉన్నట్లు తెలుస్తుంది. అలానే మూల్యాంకనంలో వచ్చిన మార్కుల కన్నా విద్యార్థులకు అదనంగా మార్కులు వేసినట్లు కూడా కొందరు సిబ్బంది అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబును వివరణ కోరగా వర్సిటీ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారని, రెండు మూడు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామన్నారు. త్వరలో పూర్తి వివరాలు విలేకరుల సమావేశం ద్వారా వెల్లడిస్తామన్నారు. వర్సిటీలో మార్కుల టాంపరింగ్ వెనుక కింద స్థాయి సిబ్బందితోపాటు పెద్దల హస్తం కూడా ఉందా, ఎంతకాలంగా మార్కుల టాంపరింగ్ జరుగుతుంది, ఇంకా ఎంత మంది విద్యార్థులు ఉన్నారు అనే కోణంలో విచారణ జరుగుతుంది.

కొలతల ప్రకారం పనులు చేయాలి

కారంచేడు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను కేటాయించిన కొలత ప్రకారం నిబద్ధతతో నిర్వహించాలని డీపీవో శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ పరిధిలో స్వర్ణ–చీరాల రోడ్డులోని పనులను పర్యవేక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, అన్నదాతలకు అనువైన తీరులో పనుల నిర్మాణం చేపట్టాలన్నారు. వారికి అవసరమైన విధంగా లింక్‌రోడ్లు, పంట కాలువల నిర్మాణంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీ వేతనంగా రూ.257లకు తగ్గకుండా ఉండేలా పనులను చేసుకోవాలన్నారు. మొదట మండల కేంద్రం కారంచేడులోని చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన పనుల విషయమై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీవో ప్రదీప్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రైతులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తెనాలిరూరల్: గంజాయి అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు రైల్వే పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ రైల్వే పోలీసు విభాగం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, జీఆర్పీ సీఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎల్.సరస్వతి ఆధ్వర్యంలో తనిఖీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. తెనాలి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై వేచి ఉన్న ప్రయాణికుల లగేజిలతోపాటు మధ్యాహ్నం వచ్చిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికుల లగేజిని అధికారులు తమ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. రైళ్ల ద్వారా గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



రైలులో ప్రయాణికుల లగేజిని తనిఖీ చేస్తున్న అధికారులు

అక్రమ మద్యం రాకెట్ గుట్టు రట్టు

- రూ.5లక్షల విలువైన మద్యం సీసాలు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సెబ్ సీఐ మారయ్య బాబు

మంగళగిరి: గోవా, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఏపీకి అక్రమంగా మద్యం తరలించి తీసుకువచ్చే ముఠాను మంగళగిరి సెబ్ అధికారులు చాకచక్యంగా అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నగర పరిధిలోని నవులూరు సెబ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ మారయ్యబాబు కేసు వివరాలు వెల్లడించారు. నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి కాలనీలోని ఓ రేకుల షెడ్డులో అక్రమంగా మద్యం నిల్వలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని సోదా చేయగా గోవా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 256 అక్రమ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. తెనాలి కళ్యాణ్ చక్రవర్తి, తెనాలి కమల్, జొన్నలగడ్డ వెంకటేష్, సంగణం బాలకృష్ణారెడ్డిలను అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం గురించి జొన్నలగడ్డ వెంకటేష్‌ను విచారించగా అతను తెలిపిన సమాచారం మేరకు బాపట్ల జిల్లా అద్దంకి మండలం తిమ్మాయపాలెంలోని ఓ నివాసంలో సోదాలు నిర్వహించారు. గోవా రాష్ట్రానికి చెందిన 38 కార్టన్ బాక్సుల అక్రమ మద్యం సీసాలను సీజ్ చేసి కాటూరి శ్రీరామచంద్రమూర్తిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు అడుసుమల్లి శ్రావణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. దాడుల్లో రూ.5లక్షల విలువైన 55 మద్యం బాక్సులు(1108 మద్యం సీసాలు) స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మారయ్య బాబు తెలిపారు. సెబ్ ఎస్ఐ మల్లికార్జునరావు, హెచ్‌సీ పి పద్మజ, ఈసీఎస్‌లు పి.రమేష్, డి.హనుమంతు, కె.రజని, ఎ శ్రీనివాసరావు, ఎం నాగరాజులు ఉన్నారు.



అక్రమ మద్యం కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ మారయ్య బాబు, సిబ్బంది

ఈ-ఫార్మసీకి వ్యతిరేకంగా 15 నుంచి ఔషధ వ్యాపారుల ఆందోళన

గుంటూరు మెడికల్: ఈ–ఫార్మసీతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, కేంద్రం ఈ–ఫార్మసీని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీ కే.పి.రంగారావు అన్నారు. మంగళవారం గుంటూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ–ఫార్మసీకి వ్యతిరేకంగా ఫిబ్రవరి 15 నుంచి దేశవ్యాప్తంగా అన్ని మండలాలు, జిల్లాలు, రాష్ట్ర రాజధానుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఔషధాల షాపులు మూసివేసి తమ నిరసన, ఆందోళన తెలియజేస్తామన్నారు. ఈ–ఫార్మసీ నిర్వాహకులు చట్టాలను ఉల్లంఘిస్తూ..ప్రజారోగ్యాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. పౌరులకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా కార్పొరేట్ సంస్థలు ఆన్‌లైన్‌లో మందులు విక్రయిస్తున్నాయని చెప్పారు.

శభాష్ పోలీస్

- మానవత్వం చాటుకున్న హెడ్‌కానిస్టేబుల్
- వృద్ధురాలి ప్రాణాలు కాపాడిన వైనం

ముప్పాళ్ల: కాఠిన్యమే కాకుండా పోలీసుల్లోనూ మానవత్వం ఉందని చాటుకున్నారు ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మక్కెన మాధవరావు. ఏం కష్టం వచ్చిందో ఏమో తనువు చాలించాలనుకొని కాల్వలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలిని చాకచక్యంగా బయటకు తీసి ప్రాణాలు కాపాడి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చాగంటివారిపాలెంకు చెందిన ధర్మరాజు సుబ్బులు(70) పెదనందిపాడు బ్రాంచి కాలువలో దిగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ మాధవరావు హుటాహుటీన సమీపంలోని కాల్వ వద్దకు చేరుకుని మరొకరి సాయంతో నీటిలో కొట్టుకుపోతున్న సుబ్బులను బయటకు లాగాడు. గమనించిన స్థానికులు హెడ్‌కానిస్టేబుల్ సమయస్ఫూర్తిని అభినందించారు. అనంతరం ఆమె వివరాలు తెలుసుకొని, వైద్య సేవలందించారు. కుటుంబసభ్యులను పిలిపించి వృద్ధురాలిని అప్పగించారు. సుబ్బులుకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు చెప్పేందుకు వృద్ధురాలు నిరాకరిస్తూ మౌనంగా ఉండిపోయింది.



వృద్ధురాలిని పీబీసీ కాల్వ నుంచి బయటకు తీసుకువస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మాధవరావు